ప్రజాశక్తి
బుధవారం 3 సెప్టెంబర్ 2025
5
విజయనగరం

నేడు జిందాల్ రైతుల కోసం గ్రామసభ : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిందాల్ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎస్.కోట మండలం మూల బొడ్డవరలో బుధవారం కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటన లో తెలిపారు. రైతులు తమ వద్ద నున్న డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలతో గ్రామ సభకు హాజరు కావాలని తెలిపారు. న్యాయపరంగా , రికార్డు పరంగా ఖచ్చితంగా ఉన్నవారికి అక్కడికక్కడే పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. లేని వారికీ కారణాలను కూడా తెలియజేస్తామని చెప్పారు. తహశీల్దార్‌తో పాటు రెవిన్యూ అధికారులు, జిందాల్ కంపెనీ వారు రికార్డులతో హాజరవుతారని తెలిపారు. జిందాల్ కోసం సేకరించిన భూముల్లో 5 గ్రామాలకు చెందిన రైతులు తమకు అన్యాయం జరిగిందని, తగిన పరిహారం అందలేదని జిల్లా కలెక్టర్‌కు పిజిఆర్ఎస్ లోనూ, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు ద్వారా , లోక్ సత్తా పార్టీ ద్వారా , నేరుగా సుమారు 45 మంది దరఖాస్తులు చేశారని, వారే కాకుండా అన్యాయం జరిగిందనుకునే మిగిలిన రైతులు కూడా హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

తప్పుడు అంచనాలతో ముంచేసిన ఎన్‌హెచ్ అథారిటీ

- పక్కపక్క ఇళ్లకూ రూ.లక్షల్లో వ్యత్యాసం
- కాళ్లరిగేలా తిరిగినా స్పందించని యంత్రాంగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రహదారి నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్) అధికారులు తప్పుడు అంచనాలతో శఠగోపం పెట్టారు. దీంతో, తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని కోరుతూ పలు శాఖల కార్యాలయాల చుట్టూ నిర్వాసితులు ప్రదక్షిణలు చేస్తున్నా వారికి పట్టడం లేదు. కలెక్టర్ స్థాయిలో జోక్యం చేసుకుంటే తప్ప నిర్వాసితులైన పేదలైన దళిత, బిసి కుటుంబాలవారికి న్యాయం జరిగే పరిస్థితులు కనిపించడం లేదు.

రాయ్‌పూర్ - విశాఖపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్న విషయం విధితమే. ఈ రహదారికి స్థానిక రహదారులను కలుపుతూ విజయనగరం జిల్లా పరిధిలో నాలుగు చోట్ల సర్కిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మెంటాడ, గంట్యాడ మండలాల పరిధిలో ఇటువంటి సర్కిల్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం కొత్తవలస మండలంలోని విశాఖ -ఎస్.కోట మార్గంలోని గాంధీనగర్ - అప్పన్నపాలెం గ్రామాల పరిధిలో మరో సర్కిల్ నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం భూ సేకరణకు రెవెన్యూ అధికారులు సిద్ధమౌతున్నారు. దీనికి ముందుగా ఈ పరిధిలోవున్న పైన పేర్కొన్న రెండు గ్రామాల పరిధిలోని సుమారు 40కుటుంబాల వారు ఇళ్లు, పశువుల శాలలు, చెట్లు వంటివాటికి నష్టపరిహారం చెల్లించే విషయమై నేషనల్ హైవే, ఉద్యాన శాఖ అధికారులు అంచనాలు కూడా వేశారు. ఈ విషయంలో ముఖ్యంగా ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ అధికారులు తప్పుడు అంచనాలతో తమ జీవితాలను ముంచేస్తున్నారంటూ నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. సమాన విస్తీర్ణం, సమాంతర పెట్టుబడితో కట్టిన ఇళ్ల నష్టపరిహారం అంచనాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. రోడ్డుకు ఒకవైపు ఉన్న ఇళ్లకు ఎక్కువ, మరోవైపు ఉన్న ఇళ్లకు తక్కువ అంచనాలు కట్టారు. అంతే కాదు... గోకుల షెడ్లకు కట్టిన నష్టపరిహారం, కొన్ని ఇళ్లకు కూడా ఇవ్వలేదు. దీంతో, మూడు తరాలుగా నివాసం ఉంటున్న ఇళ్లను తొలగించేందుకు సిద్ధపడడమే కాకుండా నష్టపరిహారం విషయంలోనూ తమకు అన్యాయం చేస్తున్నారంటూ గాంధీనగర్‌కు చెందిన మునూరు పోతమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఓ ఇంటికి రూ.20లక్షలు నష్టపరిహారంగా పరిగణించిన అధికారులు, దానికి ఆనుకునివున్న తమ రెండు అంతస్తుల భవననానికి మాత్రం రూ.21లక్ష విలువ మాత్రమే కట్టడం ఎంత వరకు సమంజసమని సబ్బవరపు పోతురాజు ప్రజాశక్తి ఎదుట కంటతడిపెట్టాడు. ఇలా ఈ రెండు గ్రామాల్లోని నిర్వాసితులంతా తమకు అధికారులు అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాంధీనగర్- అర్థన్నపాలెం మధ్య నిర్మించిన గ్రీన్ ఫీల్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి

తిరగని చోటు లేదు

ఇళ్ల నష్టపరిహారం అంచనాల దశలోనే మోసపోయిన నిర్వాసితులు తిరగని చోటు లేదు. తొలుత సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లారు. స్థిరాస్థుల అంచనా విలువలు ఆర్అండ్‌బి అధికారులు చూస్తారని ఆయా అధికారులు చెప్పడంతో ఆర్అండ్‌బి ఎస్ఇ, ఇఇలను కలిశారు. అది జాతీయ రహదారి కావడంతో తమకు సంబంధం లేదని, ఎన్‌హెచ్ అధికారులు చూసుకుంటారని సెలవిస్తున్నారు. ఆ కార్యాలయం, సంబంధిత అధికారులు కూడా అందుబాటులో లేకపోవడంతో తమ కష్టనష్టాలను ఎవరికి ఎక్కడ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

రీ ఎస్టిమేషన్ వేయాలి

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితుల ఇళ్ల నష్టపరిహారం విషయంలో అధికారులు మరోసారి అంచనాలు వేయాలి. పరిహారం మంజూరులో లోపాలను సరిచేసి, చెల్లింపులు చేపట్టాలి. అధికారులు సక్రమంగా భూ సేకరణ చేపట్టలేదని, కోల్పోయిన ఇళ్ల పరిమాణాన్ని తప్పుగా లెక్కించలేదు. కలెక్టర్, ఆర్‌డిఒ, ఆర్అండ్‌బి అధికారులకు వినతి పత్రం ఇచ్చినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. హైవే కోసం ఇళ్ల త్యాగం చేస్తున్న నిర్వాసితులను ఇలా తిప్పడం సమంజసం కాదు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలి.

గాడి అప్పారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

ఇళ్లు లాగేసుకుని రూ.11లచ్చలు ఇస్తారట!

రెక్కల కష్టానికి తోడు కాసింత అప్పు కూడా చేసి ఇళ్లు కట్టుకున్నాం. వ్యవసాయ భూములు, ఇతర ఆస్తులు లేకపోయినా సొంత ఇళ్లు ఉందనే దీమాతో బతికేస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో రహదారి నిర్మాణం కోసం ఇళ్లు, భూమి లాగేసుకుంటారట. ఇంటిల్లపాదీ కలిసి ఉందామని 3సెంట్ల స్థలంలో పక్కా ఇళ్లు కట్టుకున్నాం. తమ ఇంటికి రూ.11.80లక్షలకు విలువ కట్టారు. ఇది చాలా తక్కువ. తాము కట్టుకున్నప్పుడు కూడా ఇంతకు మించి మదుపు అయ్యింది. ఈ రోజుల్లో ఇల్లు కట్టుకోవడం అంటే మాటలు కాదు.

వంక సూర్యనారాయణ, గాంధీనగర్, కొత్తవలస మండలం

చరిత్ర స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- మాన్సాస్ చైర్మన్ అశోక్‌గజపతిరాజు
- పునర్నిర్మించిన మోతీమహల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

చరిత్ర నుంచి స్ఫూర్తిని తీసుకొని భవిష్యత్ తరాలకు అందించాలని మాన్సాస్ సంస్థ చైర్మన్, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. మంగళవారం కోటలో పునర్ నిర్మించిన మోతీ మహల్‌ను అశోక్ గజపతిరాజు ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలసి తొలుత కోటలో ఉన్న ఆంజనేయస్వామి సరస్వతి దేవి విగ్రహాలకు పూజలు చేసి, అనంతరం పివిజి రాజు విగ్రహానికి అక్కడ చదువుతున్న విద్యార్థులతో పూల మాలలు వేయించి నివాళులర్పించారు. తరువాత నూతనంగా పునర్నిర్మించిన మోతీ మహల్‌ను, నాలుగు కంప్యూటర్ ల్యాబ్‌లను అశోక్‌తో పాటు ఆయన సోదరి సునీతా గజపతి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మన భవిష్యత్తు మన చేతుల్లోకి తీసుకొని బాగు చేసుకోవాలన్నారు. తమ కుటుంబం పిల్లల భవిష్యత్తు కోసం కృషిచేస్తోందన్నారు. గతంలో విజయ నగరంలో ఐదు స్కూల్స్, సాలూరులో 26 స్కూలు మోత పడ్డాయని, వీటివల్ల నిరక్షరాస్యత పెరుగుతుందన్నారు. నాగరికత సమాజంలో ప్రాథమిక విద్య, ఆరోగ్యం రెండూ ఉండాలన్నారు. నీతి అయోగ్ నివేదిక ప్రకారం.. 14 లక్షల మంది పిల్లలకు బడులు లేకుండా చేశారన్నారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూ కలిసి పని చేద్దాం అని పిలుపునిచ్చారు. మాన్సాస్ సంస్థ విద్య, వైద్య కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. ఒకప్పుడు మహారాజా కళాశాల అంటే ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉండేదని, ఇప్పుడు కొంత దిగజారుతుందన్నారు, మళ్లీ పూర్వవైభవం తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సునీలా గజపతిరాజు, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విద్యావతి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఆర్ కళాశాల సిబ్బంది, మాన్సాస్ సంస్థ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మోతీ మహల్‌ను ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు, సునీతాగజపతి

డ్రోన్ల వినియోగం పెరగాలి : మంత్రి

ప్రజాశక్తి-శృంగవరపుకోట (జామి)

వ్యవసాయ సాగులో డ్రోన్ల వినియోగం పెరగాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కిసాన్ డ్రోన్‌ను జామి మండలం మొక్కాసవలస గ్రామానికి చెందిన లబ్ధిదారు కూనిరెడ్డి సత్యనారాయణ మూర్తికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. రూ. 9.8 లక్షల విలువైన కిసాన్ డ్రోన్ ను ఎనభై శాతం సబ్సిడీతో వ్యవసాయ శాఖ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఒక్కొక్క డ్రోన్ కు ప్రభుత్వం రూ. 8 లక్షలు సబ్సిడీ ఇస్తుంది. డ్రోన్ పంపిణీ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద జిల్లాలో 24 డ్రోన్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని, ఇందుకోసం రూ. 1.92 కోట్ల మొత్తాన్ని సబ్సిడీ కింద ప్రభుత్వం వెచ్చిస్తుందని చెప్పారు. ఇప్పటికే 17 కిసాన్ డ్రోన్లను లబ్ధిదారులకు అందజేశామని, త్వరలోనే మిగిలిన వాటినీ అందిస్తామని తెలిపారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ఎరువులు, పురుగు మందులను వేగవంతంగా పిచికారీ చేసేందుకు డ్రోన్ ల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులు ఈ పథకాన్ని విరివిగా ఉపయోగించుకోవాలని మంత్రి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

డ్రోన్‌ను అందజేస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

పండగ లోపు పనులు పూర్తి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ పండగను పురస్కరించుకుని నగరపాలక సంస్థ ద్వారా నిర్దేశించిన పనులు ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. నగర వ్యాప్తంగా ఉన్న డివైడర్ల గ్రిల్స్ కు రంగుల అద్దే పని శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడా వీధి దీపాల సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విపణికల్ప ప్రాంతంలో ఉన్న నగరపాలక సంస్థ స్థలాన్ని చదును చేసి విజయనగర ప్రముఖుల వివరాలతో కూడిన చిత్రమాలికను (ఫోటో ఎగ్జిబిషన్) ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంఇ ప్రసాద్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీప్లానర్లు హరిబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

లే అవుట్ క్రమబద్ధీకరణపై విస్తృత అవగాహన

లేఅవుట్ క్రమబద్ధీకరణ విధానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని లైసెన్సెడ్ టెక్నికల్ పర్సన్స్, ప్రణాళిక కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లే అవుట్ క్రమబద్ధీకరణ విధానానికి మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉందని, ఈలోగా ప్రతి ఒక్కరూ లేఅవుట్ క్రమబద్ధీకరణ చేసుకునే విధంగా చైతన్యం తీసుకురావాలన్నారు.అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం నమోదై, దర్యాప్తులో ఉన్న గంజాయి కేసులను ఎస్‌పి వకుల్ జిందల్ మంగళవారం సమీక్షించారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో ఎస్‌పి జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించి, వివిధ పోలీసు స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకొని, కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండేందుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుల గురించి సమాచారం సేకరించాలని, వారి ఆచూకీని గుర్తించేందుకు సాంకేతికతను వినియోగించాలని తెలిపారు. గంజాయితో పట్టుబడిన కేసుల్లో గంజాయి రవాణాకు పాల్పడిన వ్యక్తులతోపాటు, వారికి గంజాయిని సరఫరా చేసిన వ్యక్తులు, విక్రయించిన వ్యక్తులను, ఇతర ప్రధాన నిందితులను కూడా ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చాలన్నారు. గంజాయి కేసుల్లో అర్హులైన నిందితలపై పి.డి.యాక్టు ప్రయోగిం చేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను అదేశించారు. ఎఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహిళలకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి- విజయనగరంకోట

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పాఠశాలలో డ్రైవింగ్ శిక్షణకు జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్.సి.కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు డి.వెంకటేశ్వరరావు కోరారు. ఆసక్తి గల మహిళా అభ్యర్ధులు పూర్తి చేసిన దరఖాస్తుకు, కనీసం ఏడాది కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ (ఎల్.ఎం.వి.), హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్సు రిజిస్ట్రేషన్ (ఎల్.ఎల్.ఆర్.) పత్రాలను జత చేసి, కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. వివరాలకు 9030014742, 9642460838, 9652600967 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

జొన్నాడ టోల్‌గేటు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జొన్నాడ వద్ద నున్న టోల్ గేట్ యాజమాన్యం నిబంధనలయిఅ విరుద్ధంగా టోల్ ఫీజు వసూలు చేస్తూ వాహన వినియోగదారులను ఇబ్బందులు పెడుతున్నారని, యాజమాన్యంపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర సూక్ష్మ,చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. ఈమేరకు మంత్రిని కలసి వినతి అందజేశారు. జొన్నాడ టోల్ గేట్ పరిధిలో రఘు కాలేజీ నుండి టోల్ గేట్ వరకూ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, విద్యుత్ దీపాలు లేవని, టోల్ ఫీజు చెల్లించే వినియోగదారులతో అక్కడ సిబ్బంది చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జొన్నాడ లో టోల్ గేట్ ఏర్పాటు చేసి దోపిడీ చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని తెలిపారు.

అర్జీదారుల సమస్యను అర్థం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్జీదారులు తమ సమస్యలు , బాధలు తీరుతాయనే పిజిఆర్ఎస్ కు వస్తారని, వాటిని అర్థం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన సేవ అని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. అర్జీదారుల పట్ల సానుకూల వ్యవహారం ఉండాలని, దరఖాస్తులలో వాస్తవికత ఉంటే పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో పిజిఆర్ఎస్ నోడల్ అధికారులతో ఆర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. సమాధానం రాసిన తర్వాత అర్జీదారు సంతృప్తి చెందేలా ఉండాలని, ఎట్టి పరిస్థితిలోనూ రీ ఓపెన్ కాకూడదని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రత్యేకంగా ఆర్జీల పై ఒక బృందం పని చేస్తోందని, నిరంతరం వారు పర్యవేక్షిస్తున్నారని, పిజిఆర్ఎస్ కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అదనపు ఎస్.పి సౌమ్యలత, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ మురళీ, జిల్లా అధికారులు, పిజిఆర్ఎస్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐ సొసైటీ కార్యాలయం

విజయనగరం టౌన్ : స్థానిక మర్రి చెన్నారెడ్డి భవన ప్రాంగణంలోని డిఆర్‌డిఎ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త నూతన కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐ సొసైటీ సమన్వయకర్త ఎస్.రూపవతి, విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, బోధన, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డిఆర్‌డిఎ-వెలుగు కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. శాఖాపరమైన కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యాలయం వద్ద ఉన్న భారతరత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ఈ సందర్భంగా కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి అన్నపూర్ణ, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐ సొసైటీ సమన్వయకర్త ఎస్.రూపవతి, డిఆర్‌డిఏ అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

విజయనగరంకోట : జిల్లాలో భూ గర్భ జలాల స్థాయిలను పెంచడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అందుకు గానూ ఉపాధి హామీ ద్వారా చెక్ డామ్‌లను, ఫారం పాండ్స్ ను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఛాంబర్ లో భూ గర్భ జలాల స్థాయిలపై చర్చించారు. జిల్లాలో 215 గ్రామాల్లో భూగర్భ నీటి స్థాయి లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారని, ఈ గ్రామాల్లో భూ గర్భ జలాల స్థాయిలను పెంచడానికి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. డ్వామా పీడీ శారదా దేవి , ఇరిగేషన్ ఇఇ రమణ, గ్రౌండ్ వాటర్ డిడి దినకర్ పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సంతకవిటి

ఈ నెల 7,8 తేదీల్లో రాజాంలో జరిగే సిఐటియు 11వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండవకురిటి, సంతకవిటి పిహెచ్‌సిలోని సిఐటియు జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 11వ జిల్లా మహాసభలు ఈనెల 7,8 తేదీల్లో రాజాంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. 7వ తేదీన ఉదయం 10 గంటలకు రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ర్యాలీ నిర్వహించి అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.అసిరప్పుడు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, రమణమ్మ, అరుణ కుమారి, లక్ష్మీ, రాజులమ్మ, ఝాన్సీ, శాంతమ్మ, గౌరీ, సుగుణ పాల్గొన్నారు.

వంగర: ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు నిర్వహించిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటయు నాయకులు, ఆశావర్కర్లు

శృంగవరపుకోట: సిఐటియు 11వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు సిహెచ్ ముత్యాలు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌వద్ద గోడ పత్రికను విడుదల చేశారు. **రాజాం:** సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు కోరారు. బొద్దాం, రాజాం, పొగిరి పిహెచ్‌సిలను సందర్శించి ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి నాయకులు అనురాధ, రత్నం, గౌరీ రమణమ్మ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహారాజా ప్రభుత్వ సంగీత నిత్య కళాశాలలో గణపతి ఉత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన గాత్ర కచేరి అందరినీ ఆకట్టుకుంది. టిటిడి పూర్వ ఆస్థాన గాయకులు, సంగీత కళాశాల పూర్వ విద్యార్థి గురజాడ మధుసూదనరావు గాత్ర కచేరి చేశారు.వీరికి వయోలిన్ పై నీలాద్రి, మృదంగంపై రాధాకృష్ణ, కళాశాల పూర్వ విద్యార్థి వెంకటరావు మోర్‌సింగ్‌పై సహకారం అందించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘ గౌరవాధ్యక్షులు బిఎ నారాయణ మాట్లాడుతూ ఎందరికో విద్యార్థిగా అధ్యాపకులుగా అవకాశమిస్తూ బంగారు భవిష్యత్తు అందించగల సరస్వతి నిలయం ఈ కళాశాల అన్నారు. ఇక్కడ విద్యార్థులు కళాశాల కీర్తిని ఇనుమడింప చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రధాన కార్యదర్శి బూరాడ శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



గాత్ర కచేరి చేస్తున్న పూర్వ విద్యార్థి మధుసూదనరావు

పారా జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్‌లో పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన 14వ పారా జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ -2025 పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు సత్తా చాటారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తెలిపారు. బొబ్బిలి ఆసియన్ ఎయిడెడ్ బ్లైండ్ స్కూల్ కు చెందిన టునా గమంగా (ఎఫ్ -12 కేటగిరి) జావలెన్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించగా, టి -13 కేటగిరికి సంబంధించి లాంగ్ జంప్ లో జి.నందిని సిల్వర్ మెడల్ సాధించింది. మొదటి సారి జాతీయ పోటీల్లో పాల్గొన్న సాయి కొరియన్ క్యాంపస్ ఛాలెంజ్‌కు చెందిన కొంతల సోములమ్మ (టి-38 కేటగిరి) 100 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్, 400 మీటర్ల పరుగులో బ్రాంజ్ మెడల్ సాధించింది. మెడల్స్ సాధించిన క్రీడాకారులకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అభినందించారు.

ఫెన్సింగ్ పోటీల్లో పలు పతకాలు

గతనెల 30 ,31 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన 11 వ రాష్ట్రస్థాయి క్యాడెట్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా గర్ల్స్ ఇప్పీ టీమ్‌కు సిల్వర్ మెడల్, ఫోయల్ టీమ్‌కు బ్రాంజ్ మెడల్ లభించాయి . ఈ టీమ్‌కు కోరాడ అప్పలరాజు కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా నుండి ప్రముఖులు, జిల్లా ఫెన్సింగ్ సంఘ ప్రతినిధులు ఆర్.దాలి రాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్, సతీష్ కుమార్ అభినందనలు తెలిపారు. పథకాలు పొందిన క్రీడాకారులంతా స్థానిక కస్పా హైస్కూల్లో ముఖ్య శిక్షకులు డివి చారి వద్ద శిక్షణ తీసుకున్నారు. పథకాలు సాధించిన వారిలో ఇప్పి విభాగంలో కె.హిమశ్రీ, పి. తేజస్విని, టి.యమునా సిల్వర్ మెడల్స్ సాధించగా ఫైల్ గర్ల్స్ టీమ్‌లో వి.కేసరి, డి.ధరహాసిని, టి.భానుమతి బ్రాంజ్ మెడల్ సాధించారు.

సహాయ స్ఫూర్తి ఫౌండేషన్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం పరిసర గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సహాయ స్ఫూర్తి సేవాసంస్థకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. మంగళవారం శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్ శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ (జియం) రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు గజపతినగరం, మెరకముడిదాం, సీతానగరం, పెదమేరంగి ప్రాంతాల్లో 21 కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 521 మందికి శస్త్ర చికిత్సలు చేయించినందుకు గాను మొదటి బహుమతి వచ్చింది.



అవార్డు అందుకుంటున్న ఫౌండేషన్ అధ్యక్షులు సాయికుమార్

సమాచారశాఖ ఎడిగా గోవిందరాజులు

విజయనగరం కోట : జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ సహాయ సంచాలకులుగా పి.గోవిందరాజులు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా డిపిఆర్‌ఒగా పనిచేస్తున్న గోవిందరాజులు ఇంతకుముందు జిల్లాలో ఎపిఆర్‌ఒగా, డివిజనల్ పిఆర్‌ఒగా, ఇంచార్జి డిపిఆర్‌ఒగా కూడా పని చేశారు. తాజాగా ఇక్కడ ఉద్యోగోన్నతిపై ఎడిగా నిమితులు కావడంతో, త్వరలో ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు.

సిఐటియులో చేరిన అంగన్వాడీలు

శృంగవరపు కోట : ఎస్‌కోట ప్రాజెక్టు పరిధిలో ఎఐటియుసిలో ఉన్న సుమారు 30 మంది అంగన్వాడీలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అనసూయ, గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి సమక్షంలో వి.మాణిక్యం, డి.సుశీల, ఎస్.కనకమహాలక్ష్మి నాయకత్వంలో సిఐటియులో చేరారని ఎస్ కోట ప్రాజెక్ట్ కార్యదర్శి డి శ్యామల తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

నెల్లిమర్ల: సర్వీసులో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కొండగుంపాం సర్పంచ్ పతివాడ అప్పన్న అన్నారు. మంగళవారం మండలంలోని కొండగుంపాం సచివాలయం నుంచి బదిలీ అయిన ఉద్యోగులను కార్యదర్శి లెంక తౌడు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శి శాంతి కుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుప్రజ, మహిళా పోలీస్ దివ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ రూపకు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు బదిలీపై వెళ్లిన ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గరికిపేట వైసిపి నాయకులు గుంటమాని ఉమ, రాజబాబు, కొండగుంపాం నాయకులు మీసాల ఆదినారాయణ, టిడిపి నాయకులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులకు విరాళం

వేపాడ: మండలంలోని సోంపురం జనసేన నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, వారి బృందం, పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల స్పోర్ట్స్ బనియన్ల కోసం రూ. 5వేలు విరాళం అందజేశారు. పాఠశాలకు ఈ సహాయం అందించినందుకు ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు అభినందనలు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం

గరివిడి: పాఠశాల అభివృద్ధికి అందరూ ఉండి కృషి చేస్తామని పాఠశాల కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం కొండపాలెం ఉన్నత పాఠశాలలో కమిటీ సమావేశం ప్రధానోపాధ్యాయులు బి రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. సత్తిరాజు, ఎ.సూర్యనారాయణ, పి.సంతోషి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

నెల్లిమర్ల: జరజాపుపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 175మందికి తనిఖీలు చేసి వారిలో శస్త్ర చికిత్సకు 32, కళ్లద్దాలు అవసరమైన వారు 57మంది, క్యాటరాక్ట్ 54 మందిని గుర్తించారు. 32 మందిని ఉచిత శస్త్ర చికిత్స కోసం పుష్పగిరి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో పుష్ప గిరి కంటి ఆసుపత్రి సిబ్బంది ఎం భీమ శంకరం, బి.నాగరాజు, వై.సాయికుమార్, పి.పావని, ఎం.అనురాధ పాల్గొన్నారు.

ఉత్సవాలు ..ఐక్యతకు ప్రతీక

నెల్లిమర్ల: ఉత్సవాలు సమాజంలో ఐక్యతకు ప్రతీకలని నగరపంచాయతీ టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ధామస్ పేట, ఉమా కాలనీలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలు జరపడం వల్ల సమాజంలో ఐక్యత పెరుగుతోందన్నారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ 15వ వార్డు కౌన్సిలర్ కళ్యాణం సత్యనారాయణ, ఉమా, యువకులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

గంట్యాడ: విజయనగరం ప్రభుత్వ డైట్ అధ్యాపక బృందం మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం పరిశీలించింది. పెదమజ్జిపాలెం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అధిక శాతం విద్యార్థులకు ఆశించిన స్థాయిలో ప్రమాణాలు ఉన్నాయని పసాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు మరింత మెరుగుపడాలని, జెజిబివి పాఠశాల విద్యార్థులకు మరింత సాధన అవసరమని గుర్తించారు. సిరిపురం అప్పర్ ప్రైమరీ పాఠశాలలో కొన్ని సబ్జెక్టులలో సిలబస్ ఇంకా పూర్తి కావలసి ఉందని కనీస విద్యా ప్రమాణాలు సాధన అవసరం ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్స్ ఉపయోగిస్తున్న విధానం, విద్యార్థుల అసెస్మెంట్ బుక్స్, ఉపాధ్యాయులు సమయానికి హాజరవుతున్నారా, వారి డైరీలు, విద్యార్థులకు కనీస సామర్థ్యాలు సాధించారా లేదా, మధ్యాహ్న భోజనం పథకం మెనూ సక్రమంగా అమలవుతుందా లేదా, అని ఆరా తీశారు. ఈ బృందంలో వాక చిన్నంనాయుడు, ఏ శోభాభూషణరావు, ఎస్.ఈ శర్మ, కె.అన్నారావు, డి.శ్రీనివాసరావు ఉన్నారు.

సోదర భావంతో మెలగాలి

గరివిడి: ప్రజలందరూ మతసామరస్యాన్ని పాటించి, సోదర భావంతో పండగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని తహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎస్ఐ లోకేశ్వరరావు సమక్షంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రాబోయే మిలాదున్ నబీ పండగ, వినాయక నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సమన్వయంతో నిర్వహించాలని కోరారు. ఊరేగింపులు, నిమజ్జనాల సమయంలో ఎలాంటి ఉద్రిక్తతలకు లోను కాకుండా, అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమా వేశంలో వైసిపి నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు సారిపాక సురేష్, ఆర్.ఐ కంది అచ్చితరావు, ముస్లిం పెద్దలు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అన్నయ్యను నరికి చంపిన తమ్ముడు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

హత్యకు గురైన పసుపురెడ్డి శ్రీను

తోడబుట్టిన అన్నను అతి కిరాతకంగా పీక కోసి తమ్ముడు హతమార్చిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం... పసుపు రెడ్డిచంటి తన సొంత అన్నయ్య అయిన పసుపురెడ్డి శ్రీనును గొంతు కోసి చంపినట్లు తెలిసింది. గత కొన్ని సంవత్సరాలుగా వారి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ కారణంగానే కత్తితో పీక కోసం చంపేసి నిందితుడు పరారైనట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న సిఐ జివివి రమణ; ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

అదృశ్యమైన వ్యక్తి కాలువలో పడి మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొత్త చెలికానివలస గ్రామానికి చెందిన లండ రామారావు (57) గత నెల 28న అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈయన రేగిడి ఆకుల లోవకట్ట గెడ్డలో మంగళవారం శవమై కనిపించారు. మృతుడు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు కాగా ముగ్గురికీ వివాహమైంది. మంగళవారం పొలంలో పనిచేసిన రైతులు, కూలీలకు దుర్వాసన రావడంతో కాలువలు చూసేసరికి మృతదేహం కనిపించింది. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శవ పంచనామా చేసి రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలో భూసాయవలస గ్రామానికి చెందిన కల్లూరి చిన్నమ్మలు (35) ఆగస్టు 22 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త కుమార్ ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఇంట్లో ఆ రోజున సాలూరు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్ళిందన్నారు. సాయంత్రం అయినా ఇంటికి రాక పోవడం, సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసి ఆచూకీ దొరక్క పోవడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తి చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

10 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా 10 కేజీల గంజాయి పట్టుబడిందని సిఐ వి.నారాయణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు లగేజీ బ్యాగ్‌తో పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. కర్ణాటకకు చెందిన చరనా చారి, పవన్ మంజునాథ్‌లుగా వారిని గుర్తించామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు.

సంక్షేమానికి దిక్సూచి వైఎస్ఆర్

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చీపురుపల్లి

దేశంలోనే సంక్షేమ పథకాల అమలుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి దిక్సూచిగా నిలిచారని వైసిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో పాటు వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సిఎంఆర్ జంక్షన్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ ప్రజా బాంధవుడని అన్నారు. వైయస్సార్ మనకు దూరమై నేటికి 16 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆయన చేసిన మంచి పనులు ప్రతి ఒక్కరి మధ్యలో నిలిచే ఉన్నాయని అన్నారు. ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల పాలిట ఆపద్బాంధవుడు అయ్యారని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఉపాధ్యక్షులు ఎస్.వి.వి రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు, కార్పొరేటర్లు, వార్డ్ అధ్యక్షులు, నాయకులు,పాల్గొన్నారు.



నెల్లిమర్ల: వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజల మనిషి వైఎస్ : కాంగ్రెస్

విజయనగరం కోట: వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మనిషి అనిజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ దగ్గరలో గల రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి చనిపోయి 16 ఏళ్ల అయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నాయకుడని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, షరీఫ్, రామరాజు, సమీర్, బంగారునాయుడు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని దేవిగుడి జంక్షన్లో ఉన్న వైయస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, నాయకులు వాకాడ రాంబాబు, రెహమాన్, వాకాడ సతీష్, పడాల ధర్మారావు, వసి బంగారునాయుడు, చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు, గోగాడ శ్రీనివాస్ రావు, కొట్టం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మొయిద జంక్షన్, రామ తీర్థం జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జరజాపుపేట, మొయిద విజయరాంపురం, అలుగోలు, గుషిణి గ్రామాల్లో వైఎస్ ఆర్ ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ చిక్కాల సాంబ శివరావు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, సీనియర్ నాయకులు మత్స సత్యనారాయణ, ఎస్‌సిసెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీను, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: కెల్ల జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మండల అధ్యక్షులు పొట్నూరు సన్యాసి నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారు నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వంగర: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శనరావు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కనగల పారినాయుడు, యలకల శ్రీనివాసరావు యలకల వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: పెదతాడివాడ పంచాయతీలో వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు తమ్మ నాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు కోలగట్ల తదితరులు

రాజాం: స్థానిక మాధవ బజార్ జంక్షన్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ తలే రాజేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల్ నాయుడు, జెడ్‌పిటిసి బండి నరసింహులు, వైస్ ఎంపిపి యాలాల వెంకటేష్ పాల్గొన్నారు.

బొండపల్లి: స్థానిక బజార్ జంక్షన్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి చల్లా చలంనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, మాజీ ఎంపిపి బండారు బంగారం తదితరులు పాలాభిషేకం చేసి, పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి గార తవుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు పూలమాలాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, కర్రి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర తూర్పు కాపు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి , పార్టీ నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఘోషాసుపత్రిలో రోగులకు పళ్ళు, రొట్టెలు, స్వీట్స్ పంపిణీ చేశారు. బాబామెట్ట వెలుగు ఆశ్రమంలో వద్దులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. అనంతరం పలువురు రక్తదాన దానం చేశారు. జనసేన నాయకులు అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో ద్వారపూడి, సారిక గ్రామాల్లో మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని అవనాపు విక్రమ్, డాక్టర్ అవనాపు భావన ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

గంట్యాడ: మండలంలోని బుడతనాపల్లి గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద మండల జనసేన నాయకుడు బమ్మిడి ఎర్నాయుడు కేక్ కట్ చేశారు. నాయకులు బమ్మిడి ఎల్లారావు, జోగినాయుడు, సత్యనారాయణ, కుమార్, శ్రీను, లోకిరెడ్డి సతీష్ చందు, సన్యాసిరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

చీపురుపల్లి : పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని టిడిపి, జనసేన నాయకులు స్థానిక మూడు రోడ్ల కూడలిలో కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఉచిత నేత్రదానం, అవయవ దానాలకు జనసేన కార్యకర్తలు అంగీకరిస్తూ పత్రాలపైన సంతకాలు చేసి మానవీతా సంస్థ నిర్వాహకులు బివి గోవిందరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, రౌతు కామనాయుడు, దన్నాన రామచంద్రుడు, కనకమాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇంచార్జి విసనగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, మెరకముడిదాం మండల జనసేన అధ్యక్షులు రౌతు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి యుపి రాజు ఆధ్వర్యంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు గొర్లె గోవిందరావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ వీరఅభిమాని స్వప్నిక చేతులు మీదుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక దేవి గుడి జంక్షన్ వద్ద జనసేన నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ చేతులు మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు తాండ్రంగి చంటి, టౌన్ ప్రెసిడెంట్ మెపాడ చిన్ని, సీనియర్ నాయకుడు దొగ్గ రమణ, పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న అవనాపు విక్రమ్, భావన

బొబ్బిలి: పట్టణంలో నియోజకవర్గ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, జనసైనికులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించి జనసైనికులు, యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మనోజ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కోటలో కేక్ కట్ చేసిన బేబినాయన

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం కోటలో ఎమ్మెల్యే బేబినాయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్లుగా శ్రీనివాసరావు, దాలిబాబు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్లగా పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ సిహెచ్ శ్రీనివాసరావు, జూనియర్ కాలేజీ లెక్చరర్ డి.దాలిబాబు నయమించారు. నియామక పత్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావుకి జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ పొనగంటి కృష్ణమూర్తికి జిల్లా రెడ్ క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ డి సూర్యారావు, కోఆర్డినేటర్ మన్మథరావుతో కలిసి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి. సంధ్యారాణి ఆఫీస్ ఇంచార్జ్ యు వి ఎస్ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి తహశీల్దార్‌గా వరప్రసాద్

ప్రజాశక్తి- బాడంగి

మండల తహశీల్దార్‌గా (ఎఫ్ఎసి) కె.వర ప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. దత్తిరాజేరు హెచ్‌డిటిగా పనిచేసి, పదోన్నతిపై ఇక్కడికి తహశీల్దార్‌గా వచ్చారు. ఇది వరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన కె.సుధాకర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడంతో ఆగస్టు 31న రిలీవ్ చేస్తూ ఆదేశాలు వచ్చాయి.

మరణించినా...కంటిచూపు సజీవం

జిల్లా అంధత్వ నివారణా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ త్రినాథరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్ , డెంకాడ

మనిషి మరణం అనివార్యం... కానీ నేత్ర దానం ద్వారా... ఆ చివరి శ్వాసలోనే మరో ఇద్దరి జీవితాల్లో వెలుగుని నింపే అవకాశం మన చేతిలో ఉందని జిల్లా అంధత్వ నివారణా కార్యక్రమం మేనేజర్ డాక్టర్ త్రినాథరావు పేర్కొన్నారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వరకు జరుగుతున్న 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నేత్రదానంపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని అరుంధతి నగర్ అర్బన్ పిహెచ్‌సి, డెంకాడ మండలం మోపాడ పిహెచ్‌సిలో వైద్యాధికారి జికె శరణ్య ఆధ్వర్యాన మంగళవారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రినాథరావు మాట్లాడుతూ, భారతదేశంలో సుమారు 12 లక్షల మంది కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారని చెప్పారు. ప్రతి సంవత్సరం 25వేల నుంచి 30వేల వరకు కొత్తగా అంధత్వ కేసులు వస్తున్నప్పటికీ, అవసరమైన 2 లక్షల కళ్లలో, దేశం మొత్తం కలిపి 50,000 వేల కార్నియాలు మాత్రమే సేకరించబడుతున్నాయని తెలిపారు. ఈ లోటును భర్తీ చేయగలిగే అవకాశం మన చేతుల్లోనే ఉందని తెలిపారు. 3ఏళ్ల నుంచి 90 సంవత్సరాలు వయస్సు వారు ఎవరైనా నేత్రదానాన్ని చేయవచ్చునని చెప్పారు. బిపి, షుగర్, ఆస్మా, కంటి ఆపరేషన్లు పొందినవారు, కంటి అద్దాలు వాడుతున్న వారు కూడా చేయవచ్చని తెలిపారు. అనంతరం మోపాడ ఆప్తాలమిక్ అధికారి, జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆప్తాలమిక్ అధికారి బి.తారకేశ్వరరావు నేత్రదానం ప్రతిజ్ఞ పత్రాలను సిబ్బందికి అందజేసి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి అధికారి సిహెచ్ సత్యనారాయణ, పిహెచ్ఎన్ గున్నమ్మ, హెచ్‌వి బేగం, డిబిసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : సిబ్బందికి సూచనలు చేస్తున్న త్రినాథరావు

డ్రోన్ల సహాయంతో పిచికారీపై శిక్షణ

ప్రజాశక్తి- రామభద్రపురం

ఆధునిక వ్యవసాయ విధానాలు అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని స్థానిక ఎఒ అమరా శివ సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం తారాపురంలో డ్రోన్ సహాయంతో యూరియా పిచికారీ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించి శిక్షణ ఇచ్చారు. యూరియాకి బదులుగా 500 ఎంఎల్ నానో యూరియా పిచికారీ చేయడం వల్ల మొక్కకు నేరుగా నత్రజని అందుతుందని, గుళికల యూరియా నేరుగా మొక్కకు చేరకుండా భూమి ద్వారా వెళ్లడం వల్ల వృథా ఎక్కువ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర రైతు సన్యాసిరావు, ఎఇఒ వెంకటరమణ, రైతు సేవా కేంద్ర సిబ్బంది మాధురి గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని అరిగిపాలెం, జగ్గయ్యపేట గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నానో యూరియా మీద అవగాహనా కల్పించారు. నానో యూరియా పిచికారీ వల్ల మొక్కలు నత్రజనిని డైరెక్ట్‌గా తీసుకోని 10-15 రోజులు పాటు నత్రజని వాడుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ హరిత, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నరవ గ్రామంలోని డ్రోన్‌తో ఎరువులను పిచికారి చేసే విధానంపై వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా జెడి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎకరానికి నానో యూరియా అర లీటర్ 120 లీటర్ల నీటిలో కలిపి డ్రోన్‌తో పిచికారి చేస్తే సరిపోతుందన్నారు. దీని వల్ల భూములో ఉన్న సూక్ష్మజీవులకు ఎటువంటి ఇబ్బందులు కలగవన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నాగభూషణం, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భారతి, ఎఒ బి.శ్యామ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, మన గ్రోమోర్ సెంటర్ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

రామభద్రపురం: డ్రోన్‌పై శిక్షణ ఇస్తున్న ఎఒ శివ

గజపతినగరం రూరల్: రైతుల సమస్యలు తీర్చడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎఒ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని కొనిశ, కొత్తబగ్గాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. యూరియా బదులుగా నానో యూరియా రెండో దఫా పిచికరి చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్దతాడివాడ పంచాయతీలో, యూత్ క్లబ్ బెజ్జిపురం ఎన్‌జిఒ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై మంగళవారం అవగాహన, అనుసంధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సమన్వయకర్త జి.ఝాన్సీ రాణి మాట్లాడుతూ యూత్‌క్లబ్ బెజ్జిపురం ఎన్‌జిఒ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ న్యూఢిల్లీ సహకారంతో జిల్లాలో బాలలకు అందుబాటులో న్యాయం కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నిర్మూలన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై ప్రభుత్వ శాఖల సహకారంతో పని చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో గ్రామస్థాయిలో ప్రజలందరికీ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, వాటికి గల అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానంపై వివిధ శాఖల నుండి హాజరైన అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి ఏ. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నుంచి అందుతున్న సేవలు, బాల్య వివాహాల నిర్మూలన గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి శ్రీనివాసరావు, చంద్ర బాయ్, మహిళా స్త్రీ శిశుసంక్షేమ శాఖ మిషన్ కోఆర్డినేటర్ సుజాత, ఎస్ఐ సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి చింతపల్లి అప్పలనాయుడు, తుమ్మ లక్ష్మీ పాల్గొని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేశారు.

నానో ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ, ఎటిఎంఎ ద్వారా మండలంలోని పెద్ద తాడివాడ సచివాలయం వద్ద నానో ఎరువులపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ టి.సంగీత మాట్లాడుతూ వివిధ పంటల్లో రసాయనిక ఎరువులు అయిన యూరియా, డిఎపికి బదులుగా నానో యూరియా, డిఎపి వాడడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని వాతావరణ కాలుష్యం కూడా తగ్గించవచ్చునని తెలిపారు.

చింతపల్లిలో ప్రపంచ కొబ్బరి దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని చింతపల్లి కొబ్బరి పీచు సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విజయనగరం కోకోనట్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు మొంగం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి మాట్లాడుతూ కొబ్బరి అభివృద్ధి బోర్డు అమలు చేస్తున్న పలు పథకాల గురించి, ఉద్యాన శాఖ అందిస్తున్న పథకాలు గురించి రైతులకు వివరిస్తూ, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరావు రైతులకు కొబ్బరి పంటలో అంతర పంటల పద్ధతులు, ఆధునిక సాగు విధానాలు, వ్యాధి నియంత్రణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. నెల్లిమర్ల నియోజకవర్గం పి4 కమిటీ కన్వీనర్ ఆళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొబ్బరి పంటతోపాటు అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేస్తే గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కొబ్బరి పీచు, కొబ్బరి నూనె, హ్యాండ్‌క్రాఫ్ట్ ఉత్పత్తుల ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విక్రం జగన్నాథం, ఎం. ఎరకయ్య దొర, మైలపల్లి తాత తదితరులు పాల్గొని కొబ్బరి పంటలో ఎక్కువ దిగుబడి సాధించిన రైతులను ఘనంగా సన్మానించారు.

జిందాల్ నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి- శృంగవరపు కోట

జిందాల్ యాజమాన్యం కంపెనీ కడతామని తీసుకున్న భూముల్లో 18 ఏళ్లు దాటిన కంపెనీ కట్టకపోగా అదే భూముల్లో నిర్వాసిత రైతులు సాగులో ఉన్న విలువైన జీడి తోటలు, మామిడి తోటలు, టేకు తోటలు జెసిబిలతో నేలమట్టం చేయడం అన్యాయమని నిర్వాసితులు మంగళవారం బొడ్డవర వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యానికి దేశంలో ఉన్న చట్టాలు ఏవి అమలు కావా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న వాల్టా చట్టం ఏమైందని ప్రశ్నించారు. హైకోర్టులో కేసులు ఉండగా అధికారులను అడ్డుపెట్టుకొని మొత్తం భూమిలో ఉన్న పంట పలసయాలను ధ్వంసం చేయడం పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకొని నిర్వాసితుల పక్షాన నిలబడి పేదల భూమి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

డాక్యుమెంట్ పోయినది

బుర్లె మౌనిక W/o అనిల్ కిషోర్, విజయనగరం, కొత్తదుప్పాడ నివాసితులు మా ఇల్లు యొక్క డాక్యుమెంట్ నెం:2350/2017 సర్వే నెం: 89 సంబంధించిన ఇల్లు డాక్యుమెంట్ తోటపాలెం నుండి RTC కాంప్లెక్సుకు బైక్ పై వెళ్ళుచుండగా దారిలో ఎక్కడో జారి పోయినవి. దయచేసి ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెలుపగలరు.

బుర్లె మౌనిక W/o అనిల్ కిషోర్,
కొత్తదుప్పాడ, విజయనగరం,
సెల్ :7997755666